ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
శనివారం 17 ఫిబ్రవరి 2024







స్వామివారికి క్షీరాన్నం తయారీ



సూర్యభగవానుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దత్త పీఠాధిపతి శ్రీసచ్చిదానంద స్వామిజీ



ఆదిత్యదేవా.. నమోస్తుతే..

● ఘనంగా రథసప్తమి వేడుకలు ● శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రత్యేక పూజలు

కల్లూరు, ఫిబ్రవరి 16: యావత్ దేవతలు కొలిచిన రూపం..సమస్త లోకాలకు వెలుగునిచ్చే తేజోమయ స్వరూపం సూర్యనారాయణుడు. రథసప్తమి నాడు స్వామి స్వామివారు అలంకరణ లేకుండా నిజరూపదర్శనమిచ్చారు. క్షీరధారల నడుమ పాల భానుడిని చూసి మురిసిపోయిన వారు కొందరైతే..అపురూప అరణ్యశిలను దర్శించి మైమరిచిపోయినవారు ఇంకొందరు. పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి స్వామికి పుట్టినరోజు కానుకగా అందించిన వారు మరికొందరు. పవిత్ర మాఘశుద్ధ సప్తమి ఘడియల్లో కర్నూలు నగరంలోని శ్రీసూర్యనారాయణస్వామి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు తన్మయత్వం పొందారు.

ప్రత్యక్షదైవం సూర్యభగవానుడి జయంతి వేడుకలు శుక్రవారం నగరంలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తెల్లవారు జామునుంచే స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి, మాజీ మంత్రి కేఈ. ప్రభాకర్, నగర మేయర్ బీవై.రామయ్య, పాణ్యం, ఆదోని ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులు స్వామివారికి అభిషేకాలు, అరుణహోమాలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు.

● భక్తిశ్రద్ధలతో నివేదనలు:

సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు, పంచమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ వేడుకలకు దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి ఘడియల్లో సూర్యోదయాన మహిళలు పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండిపెట్టి పూజలు, మహాసౌర యాగం, సూర్య భగవాణుడికి హారతులు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సప్తమి బ్రాహ్మ ముహూర్తంలో స్వామీజీ రథసప్తమి వ్రతం నిర్వహించారు. శుక్రవారం ఉదయం సూర్యోదయ సమయాన సూర్యుడికి ఆవుపాలు,కొత్త బియ్యం, కొత్తబెల్లంతో తయారుచేసిన క్షీరాన్నం నైవేద్యంగా సమర్పించారు. మూలవిరాట్టుకు దత్తవిజయానంద తీర్థ స్వామిజీ అభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద పంపిణీ, అన్నదాన ప్రసాదవితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ట్రస్టీ శివరామకృష్ణ పాల్గొన్నారు.



పంచ రథాలపై ఊరేగిన రాఘవేంద్రులు

మంత్రాలయం, ఫిబ్రవరి 16: రథసప్తమి వేడుకలు మంత్రాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను, రజిత గజ వాహనంపై స్వర్ణ రాఘవేంద్రస్వామి ప్రతిమ, చెక్కరథంపై ఆంజనేయస్వామి, వెండిరథంపై మధ్వాచార్యులు, బంగారు రథంపై సత్యనారాయణస్వామి దర్శనమిచ్చారు. అదేవిధంగా నవరత్నాల రథంపై మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములను అధిష్ఠించి పంచ రథ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల నడుమ పంచరథోత్సవం కన్నులపండువగా సాగింది. అనంతరం పీఠాధిపతి పూర్ణబోధ పూజామందిరంలో సంస్థాన పూజ నిర్వహించారు.



మంత్రాలయంలో పంచరథ సేవలు

టీడీపీ గెలుపే లక్ష్యం

● దళిత, వాల్మీకి సభలను విజయవంతం చేద్దాం
● నియోజకవర్గ ఇన్‌చార్జిలతో బీటీ నాయుడు



మాట్లాడుతున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 16: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గాల ఇన్‌చార్జులైన టీజీ భరత్, జయనాగేశ్వరరెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, కేఈ శ్యాంబాబులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మండలాల్లో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం గురించి చర్చించారు. ఆదే స్థాయిలో జిల్లాలో దళిత, వాల్మీకి మహాసభలు, జిల్లా స్థాయి జయహో బీసీ కార్యక్రమానికి సంబంధించి తేదీలను ఖరారు చేశారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలాగే తుది ఓటర్ల జాబితాలోని లోపాలు గురించి చర్చించారు. అధికార వైసీపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 25న దళిత మహాసభను కర్నూలు నగరంలో, మార్చి 5న జయహో బీసీ సభను పత్తికొండలో, ఆ తర్వాత వాల్మీకి మహాసభను అధిష్ఠానం షెడ్యూల్‌ను బట్టి ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు.

ఉద్యమానికి సిద్ధం..!

ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్ వెంగళ్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర ఏపీ జేఏసీ పిలుపుమేరకు ఉద్యమానికి సిద్ధమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నాయకుడు వెంగళ్‌రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం జిల్లా ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కసారి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు పెన్షన్ ఇస్తున్నప్పుడు 30 సంవత్సరాలు సర్వీసు చేసిన ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేడు తాలుకా కేంద్రాల్లో ధర్నా, 20న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం అధ్యక్షుడు కె.రవి ప్రకాష్‌రావు, ఏపీ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్ నాయక్, ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్షుడు మద్దిలేటి, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ లైవ్ స్టాక్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై ఆది దంపతులు

ప్రారంభమైన స్వర్ణరథం సేవలు

శ్రీశైలం, ఫిబ్రవరి 16: సకలలోకాలకు ఆదిదంపతులైన శివపార్వతులు స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు సమర్పించిన స్వర్ణరథాన్ని శుక్రవారం ఉదయం ఆలయ అధికారులు ప్రారంభించారు. ముందుగా స్వర్ణరథానికి సంప్రోక్షణ, పూజాధికాలను నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయం రాజగోపురం నుంచి నందిగుడి వరకు అక్కడి నుంచి ప్రధానాలయం వరకు స్వర్ణరథం కదిలింది. స్వర్ణరథం ఎదుట మహిళల కోలాటల ప్రదర్శన ఆకట్టుకుంది. కోలాహలంగా సాగిన స్వర్ణరథంపై దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించారు. ఈ స్వర్ణరథ సమర్పణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బంగారు రథం విలువ రూ.11 కోట్ల ఉంటుందని సమాచారం. సుమారు 23.6 అడుగుల ఎత్తుతో తయారు చేసిన స్వర్ణరథం మధ్యలో పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కుమారస్వామి మూర్తులు, దిగువ భాగంలో బ్రహ్మ మూర్తులను చెక్కారు. స్వామి, అమ్మవార్ల చుట్టూ అష్టదిక్పాలకులు, ముందు భాగంలో స్వారీ చేస్తున్న రెండు పెద్ద అశ్వాలు, ఎనిమిది నందులు, వినాయకుడు, దక్షిణా మూర్తి, విష్ణుదుర్గ, లింగోద్భవ శివుడు ఉన్నారు. ఇప్పటి వరకు ప్రతి సోమవారం స్వామి, అమ్మవార్లకు వెండి రథోత్సవాన్ని నిర్వహించేవారు. అయితే తొలిసారిగా స్వర్ణరథంలో స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు.



స్వర్ణ రథంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి

మహా కుంభాభిషేకం
వేడుకలు ప్రారంభం

● శ్రీశైలానికి తరలివచ్చిన భక్తులు
● తొలిరోజు ఫలపుష్పాలతో ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం
● 21 వరకు కొనసాగనున్న మహోత్సవాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 16: లోక కల్యాణార్థం తలపెట్టిన మహా కుంభాభిషేకం మహోత్సవాలు శ్రీశైలం మల్లన్న ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవానికి శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి హాజరయ్యారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహాకుంభాభిషేకం మహోత్సవాన్ని ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు జరిగే మహోత్సవంలో చివరి రోజున ఆలయంలో శివాజీ గోపురానికి స్వర్ణకలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పుణరుద్ధరించిన ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేయనున్నారు. మహాకుంభాభిషేకం ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను చేపడుతారు. ఆ మంత్రపూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలను, గోపురాలను, దేవతామూర్తులను అభిషేకిస్తారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి

మహాకుంభాభిషేకాన్ని పుస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రతిరోజూ విశేష పూజలు, దేవతాహవనములు, దేవహవనములు, జపాలు, పారాయణలు నిర్వహిస్తున్నారు.

మొదటి రోజు ఇలా...

కుంభాభిషేకం మహోత్సవంలో మొదటి రోజు ఉదయం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రదక్షిణ చేసి యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం మహాగణపతిస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఋత్విగ్వరణం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశన, మండపారాధనలు, అఖండదీప్థాపన, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిమంథనం, అగ్నిప్రతిష్ఠాపన, జలాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

మోదీ పాలనకు చరమగీతం

● పేదలకు భారాలు, బడా బాబులకు రాయితీలా?
● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ. గఫూర్
● జిల్లా వ్యాప్తంగా బంద్ ప్రశాంతం



ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు



జాతీయ రహదారులపై ధర్నా చేస్తున్న డ్రైవర్లు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలని కర్నూలు మాజీ శాసనసభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం కార్మిక, ప్రజా సంఘాల అధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌యూసీఐ, రైతు కార్మిక, వ్యవసాయ సంఘాల అధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద సీఐటీయూ పాతబస్తీ కార్యదర్శి విజయ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో గఫూర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను మార్చేసి, కార్మికులను కట్టు బానిసలు చేసే పరిస్థితి తీసుకుని వచ్చారని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో తెచ్చిన అప్రజాస్వామిక చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఫలితంగా అప్పట్లో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి రైతులకు హామీలు ఇచ్చిందని, అయితే ఇప్పటికీ వాటిని అమలు చేయలేదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు మళ్లీ ఉద్యమిస్తున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతూ, బడా పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కార్మికులు, రైతులు సిద్ధం కావాలని అన్నారు. భారతదేశ చరిత్రలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగినన్ని బందులు ఎప్పుడూ జరగలేదన్నారు. దేశప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించినా మోదీ పెట్టుబడిదారుల కీలుబొమ్మగా మారి తన విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతుల పెట్టుబడిలో రైతు కుటుంబ శ్రమకు 50 శాతం కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్‌రెడ్డి, జగన్నాథం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

నదుల్లో, వాగుల్లో ఇసుక తవ్వాలంటే పర్యావరణ అనుమతులు ఉండాలి. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా ఇసుక తవ్వడానికి వీల్లేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా అక్రమార్కులు తుంగభద్రను తోడేస్తున్నారు. అధికారం మాటున అక్రమార్కులు నిబంధనలు తుంగలో కలిపేసి అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్నారు. గుడికంబాలి-1, 3 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉంటే.. ఆ ముసుగులో నదిలో ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాళ్లు అధికార వైసీపీ నాయకులకు భయపడుతున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమార్కుల తీరుపై ఆంధ్రజ్యోతి గతంలో పలు కథనాలు ప్రచురించింది. గుడికంబాలి, మరళి రీచ్‌లను పరిశీలించిన ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి ఆధ్వర్యంలోని కమిటీ తన నివేదికలో ఇసుక అక్రమాలు నిజమే అని నిగ్గు తేల్చింది. దీన్ని కలెక్టరు డాక్టరు జి.సృజనకు పంపించారు. ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..? లేక ఈ నివేదిక కూడా చెత్తబుట్టలోకి వెళ్తుందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నదిని తవ్వేస్తున్నారు

- నిబంధనలకు విరుద్ధంగా తుంగభద్రలోంచి ఇసుక రవాణా
- ఇసుక రీచుల్లో అక్రమాలు నిజమే
- నిగ్గు తేల్చిన ఆదోని సబ్ కలెక్టరు కమిటీ



కైతాళంలో ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న అధికారులు

కర్నూలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2, నందవరం మండలం నాగులదిన్నె-1 ఓపన్ రీచులు ఉన్నాయి. అలాగే సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీ సిల్టేషన్ రీచులను (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు భూగర్భ వనరుల శాఖ గుర్తించింది. ఇసుక తవ్వకాలు, రవాణా కోసం జేపీ పవర్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల లీజుకు అనుమతి ఇచ్చింది. ఈ లీజు గడువు గత ఏడాది మే 15న ముగిసినా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగించారు. ఇటీవలే సీఎం జగన్ సోదరుడికి చెందిన మరో కంపెనీకి అనుమతులు ఇచ్చారు. అయితే.. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) గత జూన్ 2న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. పర్యావరణ అనుమతులు (ఈసీ)తో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. గుడికంబాలి-1,3 రెండు రీచ్‌లకు మాత్రమే పర్యావరణ (ఈసీ) అనుమతులు ఉన్నాయని మైనింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఆ ముసుగులో అధికారం మాటున వైసీపీ నాయకులు పెట్రేగిపోతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి తుంగభద్రలో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. ఇసుక రీచ్‌లో పెత్తనం ఇసుక అక్రమార్కుల తీరుపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. కలెక్టరు డాక్టర్ జి.సృజన స్పందించారు. ఆదోని సబ్ కలెక్టరు నారాయణస్వామి నేతృత్వంతో విచారణకు ఆదేశించారు.

● రీచ్‌లను తనిఖీ చేసిన కమిటీ

చెన్నైకు చెందిన సౌత్ జోన్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, కలెక్టరు డాక్టర్ జి.సృజన సూచనలు మేరకు ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి, గనులు భూగర్భ వనరులు శాఖ (మైనింగ్) డీడీ రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ, కౌతాళం తహసీల్దారు సహా సర్వే, రెవిన్యూ సిబ్బంది బృందం కౌతాళం మండలం గుండికంబాలి-1, గుడికంబాలి-2, గుడికంబాలి-3, మరళి-1, మరళి-2 ఇసుక రీచ్‌లను ఉంటే.. ప్రధానంగా గుడికంబాలి-3, మరళి-1, 2 రీచ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా తనిఖీ చేశారు. తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు నిజమేనని విచారణ నివేదికను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు ఈ నెల 13న అందజేశారు. రీచ్‌లు గుర్తించని ప్రాంతాల్లో కూడా తుంగభద్ర ఇసుకను అడ్డంగా తవ్వేసినట్లు వారు గుర్తించారు.

ఆ నివేదికలో ఏముంది..!

- మరళి-1, 2 రీచ్‌లు తనిఖీ చేయగా.. గ్రామం నుంచి తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌లకు వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేశారు. ఆ దారి గుండా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టైర్ల గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. నదిలో ప్రధాన రీచ్‌కు వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా కందకం (గుంత) తవ్వినట్లు గుర్తించారు.
- మరళి-1 రీచ్‌ను తనిఖీ చేయగా చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు రాకపోకలు సాగించాయి. ఆ గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు రాకపోకలు సాగించినట్లు టైర్ల గుర్తులు పరిశీలిస్తే తాజాగా (విచారణ కమిటీ రావడానికి ముందు రోజు లేదా అదే రోజు ఉదయం) ఇసుక తవ్వకాలు, రవాణా చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అక్రమ మైనింగ్ వల్ల స్థానిక నివాసాల విధ్వంసం, నీటి కాలుష్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి కారణం అవుతుందని తెలుస్తుంది.
- తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నట్లు గుర్తించారు.
- మరళి-2 ఇసుక రీచ్‌కు సమీపంలోని నాన్ నోటిఫైడ్ ప్రాంతం (ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వని ప్రాంతం)లో అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు గుర్తించారు. టాటా హిటాచీ ఎక్స్ 200 చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్, టిప్పర్ ద్వారా నది వెంబడి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తనిఖీ బృందం అక్కడి చేరుకునేలోగా టిప్పర్‌తో సహా డ్రైవర్ పారిపోగా.. హిటాచీ ఆపరేటర్ ఎక్స్‌కవేటర్‌కు తాళం వేసి అక్కడి నుంచి నుంచి తప్పుకున్నాడు.
- కౌతాళం మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, మైనింగ్ డీడీ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈలు స్థానిక గ్రామస్థుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. తుంగభద్ర నదిలో అక్రమ మైనింగ్‌కు ఉపయోగించిన టాటా హిటాచీ ఎక్స్‌కవేటర్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీకి అప్పగించారు. ఇతర సామగ్రిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. హిటాచీ ఎక్స్‌కవేటర్ వివరాలు సేకరించి పోలీసులకు సహకరించాలని ఆదోని ప్రాంతీయ రవాణా అధికారి (ఎంవీఐ)కు ఆదేశించారు.



- తుంగభద్ర నదిలో 2 మీటర్లకు పైగా లోతులో ఇసుక తవ్వకాలు చేసినట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు ఉపయోగించిన చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల టైర్లు గుర్తులు స్పష్టంగా ఉన్నాయి, తనిఖీకి రావడానికి ముందే ఈ వాహనాలు కాకపోకలు సాగించినట్లు విచారణ కమిటీ గుర్తించినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా అనధికారికంగా బోర్లు తవ్వి అక్రమంగా నీటిని పంపింగ్ చేస్తున్నట్లు గుర్తించారు.
- తనిఖీలో గుర్తించిన ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వివరాలు సహా అందుకు సాక్ష్యంగా ఫొటోలతో పాటు ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి సమగ్ర నివేదికను కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు పంపించారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..?

మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, ఆయన ముఖ్య అనుచరులు, అధికార వైసీపీ కీలక నాయకుల ఆజ్ఞ లేనిదే పిడికెడు ఇసుక కూడా రీచ్‌లను దాటి బయటకు రాదని స్థానికులు అంటున్నారు. తుంగభద్ర ఒడ్డునే నది ఆధారంగా జీవిస్తున్న గుడికంబాలి, మరళి, కుంబళనూరు, మేళిగనూరు వంటి గ్రామాల ప్రజలు కూడా గంపెడు ఇసుక కావాలన్నా ఇసుక అక్రమార్కులకు డబ్బులు చెల్లించాల్సిందే. అధికారం అడ్డం పెట్టుకొని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ శివనారాయణస్వామి బృందమే నిగ్గు తేల్చింది. అక్రమ ఇసుక తవ్వకాలకు ఉపయోగించిన హిటాచీ ఎక్స్‌కవేటర్‌ను సంఘటన స్థలంలోనే స్వాధీనం చేసుకున్నారు. అది ఎవరిది..? ఎవరు తీసుకొచ్చారు..? ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తుంది ఎవరు..? అని విచారిస్తే అక్రమార్కుల గుట్టురట్టు అవుతుంది. ఈ దిశగా చర్యలు తీసుకుంటారా..? లేక అన్నీ నివేదికలులాగే దీన్నీ బుట్టదాఖలు చేస్తారా..? అసలైన అక్రమ మైనింగ్‌దారులను వదిలేసి అమాయకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటారా..? అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల ఏర్పాటు

- పరిశీలించిన కలెక్టర్ డా.జి. సృజన


సిల్వర్‌జూబ్లీ కళాశాల, ఔట్‌డోర్ స్టేడియంలో కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన పరిశీలించారు. శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కోడుమూరు, కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న కర్నూలు నియోజకవర్గాల ఎన్నికల సామగ్రి డిస్పాచ్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదట దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని పంపించేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు, కోడుమూరు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసుకుని రావడానికి, పోలింగ్ సిబ్బందిని, ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కించేందుకు అవసరమైన సెక్యూరిటీ సిబ్బందిని ఎస్పీతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎన్నికల సామగ్రి రూమ్‌లో పెట్టిన తర్వాత ఎవరూ ప్రవేశించకుండా సీలింగ్ చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే సమయంలో ఇతరులు లోపలికి రాకుండా మెయిన్ ఎంట్రన్స్ గేటు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం పోలింగ్ సామగ్రితో సిబ్బంది వెళ్లే బస్సులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీనికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్‌లలో బస్సులకు నెంబర్ ఇవ్వాలని రిటర్నింగ్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, ఫిబ్రవరి 16: మంత్రాలయం సమీపంలోని గోశాల సమీపంలో భారీగా కర్ణాటక మద్యాన్ని పోలీసులు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం కర్ణాటక నుంచి కారులో 17 బాక్సుల్లోని 1,632 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు దాడులు చేసి పట్టుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన అగ్రహారం చెన్నకేశవులు, కర్ణాటకలోని రాయచూరు జిల్లా గిలకసూగురు చెందిన వెంకటేశ్‌లపై కేసు నమోదు చేశారు. వీరిలో వెంకటేశ్ పరారీలో ఉండగా చెన్నకేశవులును అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కర్ణాటక మద్యంతో పాటు కారును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ ఆనందరెడ్డి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై డీఆర్వో సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) మధుసూదన్‌రావు అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 18 నుంచి 27 వరకు పది, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు, మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ఓపెన్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. డీఈఓ శ్యామ్యూల్ మాట్లాడుతూ జిల్లాలో 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 37,801మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

పత్తి ధర క్వింటా రూ.7351

- క్వింటానికి రూ.300 పైగా పెరిగిన ధర

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 16: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. రెండు నెలల తర్వాత శుక్రవారం క్వింటానికి పత్తి ధర రూ.300 పెరిగి గరిష్ఠంగా రూ.7,351 పలికింది. గ్రామాల్లో చాలా మంది రైతులు ధరలు పెరుగుతాయని ఆశించి పత్తిని ఇళ్లలో నిలువ చేసుకున్నారు. క్వింటం పత్తి ధర రూ.7 వేలకు మించి పలకపోవడంతో గిట్టుబాటు కాక రైతులు ధర పెరుగుతుందని ఆశించి నిలువ చేస్తున్నారు. ధరలు స్వల్పంగానైనా పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటం పత్తి రూ.10 వేలకు పైగా పెరిగితే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 16 : ఆత్మకూరు పట్టణ శివార్లలోని సిద్ధపల్లె రస్తా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ అమీర్ (74) మృతి చెందాడు. ఆత్మకూరు పట్టణంలోని నీలి తొట్ల వీధికి చెందిన సయ్యద్ అమీర్ సిద్ధపల్లె రస్తాలోని క్రాసింగ్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా, ఆటోలో వెంకటాపురం నుండి నాగరాజు అనే వ్యక్తి పాములపాడుకు పాలు అమ్మేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు సయ్యద్ అమీర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సయ్యద్ అమీర్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ సయ్యద్ అమీర్ మృతి చెందాడు. అమీర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ పట్టణంలోని ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న ఆటో డ్రైవర్ బద్రి కుమార్తె లక్ష్మీ ప్రియాంక (13) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తోందని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ప్రియాంక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు.

గుండెపోటుతో యువ వైద్యుడి మృతి


అనస్థీషియా వైద్యుడు శ్రవణ్ (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు నగరం ముజఫర్‌నగర్‌కు చెందిన అనస్థీషియా వైద్యుడు డా.శ్రవణ్ (36) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో మృతి చెందారు. మత్తు మందు వైద్యుడిగా పేరున్న డా. శ్రవణ్ 2006లో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను పూర్తి చేసి, ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో అనస్థీషియా వైద్యుడిగా పని చేస్తున్నారు. ఆయన గురువారం రాత్రంతా నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓ రోగి కేర్ కోసం ఉన్నారు. తెల్లవారుజాము గుండెపోటు వచ్చి కోలుకోలేక మృతి చెందారు. తీవ్ర ఒత్తిడి కారణంగా ఆయన మృతి చెందినట్లు తెలిసింది. డాక్టర్ భార్య కూడా డెంటల్ వైద్యురాలిగా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శ్రీమఠానికి రూ. 1.50 లక్షల విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 16. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన మురళీధర్ అనే భక్తుడు గోశాలకు రూ.లక్ష, యుఎస్ఏకు చెందిన జ్యోతి అనే భక్తురాలు అన్నదానానికి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో వారు కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాతలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 91 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 16: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు శుక్రవారం 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3,409 మందికి గాను, 3354 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 1822 మందికి గాను 1785 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1587 మందికి గాను 1569 మంది హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు ఆయన వివరించారు.

కిడ్నీ మార్పిడి సక్సెస్

- కర్నూలు జీజీహెచ్‌లో రెండు అరుదైన ఆపరేషన్లు
- బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి కిడ్నీ సేకరణ
- కడప వాసికి అమర్చిన వైద్యులు


కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులతో వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇద్దరు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. సి.బెళగల్‌కు చెందిన 26 ఏళ్ల ఈరన్నకు తన తల్లి ఈరమ్మ దానం చేసిన కిడ్నీని జనవరి 29న వైద్యులు కిడ్నీని అమర్చారు. అలాగే ఈ నెల 6వ తేదీన బ్రెయిన్‌డెడ్ అయిన పావనీలత నుంచి సేకరించిన కిడ్నీని కడప నగరానికి చెందిన 44 ఏళ్ల ఎస్తేర్ రాణికి కిడ్నీని అమర్చారు. పది రోజుల్లో రెండు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగడం ఆసుపత్రి చరిత్రలో ప్రప్రథమం. ఇద్దరు రోగులు ఆరోగ్యంతో కోలుకుని శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు.



సి.బెళగల్‌కు చెందిన ఈరన్న (26) గత ఆరేళ్ల నుంచి కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారానికి రెండుసార్లు కీమో డయాలసిస్ చేయించుకుంటున్నారు. యువకుడు కాబట్టి రోగికి అతని తల్లిదండ్రులకు కిడ్నీ మార్పిడి కోసం యూరాలజీ, నెఫ్రాలజీ వైద్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. చివరకు ఈరన్న తల్లి ఈరమ్మ కిడ్నీ దానం చేయడంతో యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య నేతృత్వంలో జనవరి 29న కిడ్నీ మార్పిడి చేశారు.



ఎస్తేర్ రాణి (44) కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉంటోంది. 4 సంవత్సరాల నుంచి ఆమె సీకేడీతో బాధపడుతుంది. డయాలసిస్‌తో నరకయాతన అనుభవించేది. కిడ్నీ మార్పిడి కోసం ఆమె కుటుంబ సభ్యులకు వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. జీవన్‌దాన్‌లో ఆమె రిజిస్ట్రేషన్ చేసుకుని జనవరి 5న కర్నూలు జీజీహెచ్‌లో అడ్మిషన్ పొందారు. 6వ తేదీ కర్నూలుకు చెందిన పావనీలత బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో తల్లిదండ్రులు అవయవదానం ఇచ్చేందుకు ముందుకు రావడంతో డాక్టర్ సీతారామయ్య పావనీలత నుంచి కిడ్నీని సేకరించి, అదే రోజు ఎస్తేర్ రాణికి అమర్చారు.

ప్రాణం పోసిన పావనీలత

ఇటీవల బ్రెయిన్‌డెడ్ అయిన పావనీలత అవయవదానం వల్ల నలుగురికి పునర్జన్మ కలిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.వెంకటరంగారెడ్డి అన్నారు. పావనీలత అవయవదానం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మొట్టమొదటసారిగా కేడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం కర్నూలు జీజీహెచ్‌కే దక్కుతుందన్నారు. ఆసుపత్రిలో అరుదైన సర్జరీ చేయడానికి నిపుణులైన వైద్యుల బృందం ఇక్కడ ఉందని కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసిన యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా కోఆర్డినేటర్లు, నర్సింగ్ సిబ్బందికి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల్లో రెండు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనంత్, వైద్య కళాశాల అధ్యాపకులు కొండారెడ్డి, మాత్య్సశ్రీ, రాజారెడ్డి, రవితేజ, మహేష్, రాజశేఖర్, వెంకట పక్కీరెడ్డి, శ్రీధర్, జీవన్‌ధాన్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దవంగలిలో పండ్ల తోటల దగ్ధం

చాగలమర్రి, ఫిబ్రవరి 16: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో రైతులు హరికృష్ణ, ఉమామహేశ్వరి, భారతి, వీరమ్మ సాగు చేసిన మామిడి, నేరేడు, సపోటా, ఖర్జూరం తోటలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. తోటలు దగ్ధమై రైతులకు నష్టం వాటిల్లింది. రైతు హరికృష్ణ సాగు చేసిన 4 ఎకరాల్లో మామిడి, ఉమామహేశ్వరి సాగు చేసిన 4 ఎకరాల్లో ఖర్జూరం, వీరయ్య సాగు చేసిన 3 ఎకరాల్లో సపోటా, నేరేడు, భారతి సాగు 4 ఎకరాల్లో మామిడి, సపోటా తోటలు దగ్ధమయ్యాయి. చెట్లకు నీరు కట్టుకునేందుకు ఏర్పాటు చేసిన 300 నీటి పైపులు కాలి బూడిదయ్యాయి. రూ.15 లక్షలు దాక రైతులకు నష్టం వాటిల్లింది. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. పండ్ల తోటల బీమా పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

మార్చి 3న పల్స్ పోలియో

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: మార్చి 3న జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయండి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికలకు సన్నద్ధతపై కర్నూలు కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమావేశం నిర్వహించారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులే కాక మైనర్ రూట్స్‌లో కూడా భద్రతా పరమైన చర్యలు తీసుకోవడానికి గానూ సరిహద్దు జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించుకోవాలని ఎస్పీని ఆదేశించారు.

రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికి చర్య

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికి పంద చర్య అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న సమయంలో సాక్షాత్తు శాసన సభలో అమరావతి రాజధాని ఏర్పాటును స్వాగతిస్తున్నామని, వీలైనంత ఎక్కువ భూమిని సేకరించి, అత్యున్నతంగా రాజధాని నిర్మాణం చేపట్టాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి సూచన చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి కాగానే మూడు రాజధానుల డ్రామాలకు తెరతీశారని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 35 వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు, కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు.

కోర్టు తీర్పు.. వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు

గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్

కల్లూరు, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనపై హైకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరువెంకటరెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో మల్లెలతో కలిసి గౌరు దంపతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాజధాని కోసం అమరావతిలో రైతుల ఇబ్బందులపై చిత్రీకరించిన సినిమా రాజధానిఫైల్స్‌ను అడ్డుకునేందుకు వైసీపీ చేసిన పన్నాగాలను కోర్టు అడ్డుకుందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతే రాజధాని అని ఒప్పుకుని అధికారంలోకి రాగానే మూడు రాజధానులని మాటమార్చిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ, రాజధాని నిర్మాణానికి 35వేల ఎకరాల భూములిచ్చి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట కలిగిందన్నారు.

ఓర్వకల్లు: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు హైకోర్టు తీర్పుతో బద్దలయ్యాయని, సినిమా విడుదలకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హుశేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో సెన్సార్ కోర్టు సర్టిఫికెట్లు, రికార్డులు సక్రమంగానే ఉన్నాయని కోర్టు అభిప్రాయపడటం జగన్‌రెడ్డికి చెంపపెట్టన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ షాషావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీల శకం ముగిసింది: బీజేపీ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 16: ప్రాంతీయ పార్టీల శకం ముగి సిందని, వచ్చే ఎన్నికల్లో జాతీయ పార్టీలదే హవా అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రజాపోరు కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రైమ్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీల ఆస్తులకు హక్కులు ఉన్నట్లు వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. బీజేపీలో ఇలాంటి నీచ రాజకీయాలు లేవన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బలమైన పార్టీలాగా అధికార, ప్రతి పక్ష పార్టీలు అనుకుంటున్నాయని, అలాంటప్పుడు పొత్తుల కోసం ఎందుకు ఆరాటపడుతున్నాయని అన్నారు. ఈ నెల 21న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అధ్యక్షతన ప్రజాపోరు యాత్రను జాతీయ నాయకులతో ప్రారంభిస్తారన్నారు. ఈకార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీల కంఠ, సీనియర్ నాయకులు పోలంకి రామస్వామి, రాఘవేంద్ర, సందడి సుధాకర్, కాశీవిశ్వనాథ్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరగనుంది. సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీ కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన వహించనున్నారు. పాణ్యం, కర్నూలు, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్ ఖాన్, జే.సుధా కర్, కమిషనర్ భార్గవతేజ హాజరుకానున్నారు.

ఆకాశవాణి కేంద్రంలో రైతు దినోత్సవం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 16: కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో రైతు దినోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ దేవరబొట్ల మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సి. శ్యామలమ్మ, వ్యవసాయశాఖ ఏడీ ఎస్ వెంకటేశ్వర్లు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ జి.రఘుబాబు, పశు వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఎన్ నవీన్‌కుమారెడ్డిలతో పాటూ వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

రాష్ట్ర సంపద సృష్టికర్త చంద్రబాబే

ఓర్వకల్లు, ఫిబ్రవరి 16: రాష్ట్ర సంపద సృష్టికర్త చంద్రబాబు నాయుడేనని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం భైరెడ్డికాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టో కరపత్రా లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సంపదను సృష్టించి ప్రజలకు అందజేయాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఉప సర్పంచ్ షమీనా, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, సత్యనారాయణ గౌడు, అంజి, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, అన్వర్, బజారు, రాముడు, శేఖరప్ప, జీకే శేఖర్, జయక్రిష్ణ, గువ్వ రవి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 16: శ్రీకృష్ణదేవరాయల 553వ జయంతిని శుక్రవారం కాపునాడు, బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి సంఘం నాయ కులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు జాతికి శ్రీకృష్ణదేవరాయలు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, గౌరవ సలహా దారులు పత్తి ఓబులయ్య, బాలరాజు, సుబ్రహ్మణ్యం, నగర బలిజ సంఘం నాయకులు ఈశ్వర్ కుమార్, ప్రేమ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పల్లంశెట్టి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ శ్రీను, డాక్టర్ ప్రతాప్, అనిమి రెడ్డి, శోభన్‌బాబు, బీఎస్ రావు, జనసేన రాము, రవి పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ జి.సృజన, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను శుక్రవారం పరిశీలి ంచారు. ఈవీఎంల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

కార్మిక, కర్షక ద్రోహులను చరిత్ర క్షమించదు

- పీపీఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి
- జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 దిగ్బంధం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: దేశంలో కార్మిక, కర్షకులను సమస్యల సుడిగుండంలోకి నెట్టిన ప్రభుత్వాధినేతలను చరిత్ర ఎన్నిటికీ క్షమించదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు వద్ద బెంగుళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి 44పై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు కిమీ మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నాయని అన్నారు. కోట్లాదిమందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగంపై ఈ ప్రభుత్వాలు కక్షగట్టాయని విమర్శించారు. డ్రైవర్లు చిన్న తప్పు చేసినా రూ. 10 లక్షలు జరిమానా విధించి, 10 ఏళ్ళు జైలుకు పంపే చట్టాన్ని కేంద్రంలో తీసుకుని వస్తే దానికి ఎగబడి వైసీపీ, టీడీపీలు బలప రచి డ్రైవర్లను బలిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.అన్వర్ బాషా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● లాంగ్‌లారీ ఓనర్, డ్రైవర్ అసోసియేషన్, మోటార్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అధ్వర్యంలో రవాణారంగ బంద్‌లో భాగంగా నగర శివారులోని కార్బైట్ ఫ్యాక్టరీ సమీపంలోని బెంగుళూరు-హైదరాబాదు జాతీయ రహదారిపై గంటన్నరపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా నాయకులు మిన్నల్ల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ సెక్షన్ 106-1-2లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

● అఖిల భారత గ్రామీణ బంద్ పిలుపుమేరకు నగరంలోని ఇన్సూరెన్సు ఉద్యోగులు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సునీల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులపై వివక్షతతో కూడిన విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కర్నూలు(రూరల్): రైతులను దగా చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామంలో శుక్రవారం గ్రామీణ భారత్ బంద్‌ను డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తు లకు దోచిపెట్టడం కోసం మోదీ తెచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దు చేసి పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చే విధంగా చట్టాన్ని తీసుకరావాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఇస్మాయిల్, వెంకటయ్య, లోకన్న, మద్దిలేటి, కృష్ణ, సోమేష్, తిమ్మప్ప, శివన్న, అబ్దుల్లా పాల్గొన్నారు.

కల్లూరు: గ్రామీణ భారత్‌బంద్ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ, రైతుసంఘం ఆధ్వర్యంలో కల్లూరు మండలం చిన్నటేకూరు జాతీయ రహదారిపై రాసత్రోకో నిర్వహించారు. శుక్రవారం రైతు సంఘం మండల కార్యదర్శి ఏ.క్రిష్ణ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమానికి ఏపిరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు హాజరయ్యారు. రైతులు పండించిన పంటలకు ఎస్‌పీఎం చెల్లిస్తామన్నా బీజేపీ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోలేదని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నారాయణ, గోపాల్, మాబాషా, కేశాలు, కార్మికులు యేసురాజు, సోమేశ్వరయ్య పాల్గొన్నారు.

కోడుమూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. ఆయా సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. నాయకులు గఫూర్ మియా, వీరన్న, లక్ష్మన్న, రాజు రంగస్వామి, మధు, రాజు పాల్గొన్నారు.

గూడూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిందామని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. శుక్రవారం గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్, రవి అధ్యక్షతన జరిగిన రాస్తారోకోలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిన కూడా కార్మికుల, రైతుల, ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, దుబ్బన్న, భగవాన్ దాస్, హమాలీ కార్మికులు కోమ్మురాజు, అబ్రహాం, రవి, మున్సిపల్ కార్మికులు శాంతన్న, గుంటన్న పాల్గొన్నారు.

సి.బెళగల్: బీజేపీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై సీఐటీయూ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా ఓర్వకల్లులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. షాపులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి హౌసింగ్, వ్యవసాయ కార్యాలయాలను బంద్ చేసి జాతీయ రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, సీపీఐ మండల కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ మండల కార్యదర్శి షాజహాన్, చంద్రబాబు నాయుడు, మధుసూదన్ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు



కోడుమూరులో..



గూడూరులో..



చిన్నటేకూరులో..



కార్బైట్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు



ఉల్చాలలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



సి.బెళగల్‌లో..

సర్వ దేవాత్మకుడు సూర్య భగవానుడు

- నగరంలో ఘనంగా రథసప్తమి
- యోగా, విద్యాసంస్థల్లో ఆలయాల్లో పూజలు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 16: సర్వ దేవాత్మకుడు సూర్య భగవానుడని, శారీరక, మానసిక రుగ్మతల నివారణకు సూర్య నమస్కారాలు దోహదపడతాయని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం రథసప్తమి వేడుకను నగరంలోని విద్యాసంస్థలు, యోగ శిక్షణ కేంద్రాలు, ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదిత్యుని చిత్రపటాలకు, విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా గృహిణులు తమ ఇండ్ల ముందు రథం ముగ్గులు వేసి, సూర్యనారాయణుడికి నైవేద్యాలు సమర్పించారు.

● టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. నగర శివారు బి.తాండ్రపాడులోని క్రెడో పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సూర్యోపాసనతో ప్రతి ఒక్కరూ సర్వశక్తిమంతులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగ శిక్షణ గురువు మాస్టర్ అనంత అనిల్‌కుమార్ విద్యార్థులతో సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేయించి, వాటి ప్రాధాన్యతను వివరించారు.

● నగరంలో వెంకటరమణ కాలనీలోని శ్రీ పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రంలో రథ సప్తమి వేడుకను ఘనంగా నిర్వహించారు. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య సూర్య నారాయణ మూర్తి చిత్రపటానికి పూజలు చేసి, గణపతి పూజ, ఆదిత్య హృదయం పఠించారు. అనంతరం శిష్యబృందంతో సూర్య నమస్కారాలు చేయించారు.

● ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో...ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర శివారు పుల్లారెడ్డి నగర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిరంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి విచ్చేసి సూర్యనమస్కారాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులతో యోగ, సూర్యనమస్కారాలు చేయించారు.



రథ సప్తమి విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

హరిహర క్షేత్రంలో.. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మో త్సవాల్లో భాగంగా శుక్రవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఉదయం వేకువ జామునే శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామి వార్లకు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం సర్వజన ఆరోగ్య సంరక్షణకు సూర్య నారాయణ స్వామి ప్రీతర్థం అరుణ హోమము చేపట్టారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరింపజేసి, సూర్యప్రభ వాహనంపై ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు. రాత్రి ఆలయం ఆవరణలో సూర్య కల్చరల్ అకాడమీ విద్యా ర్థులతో కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కళ్లే చంద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, కార్యవర్గ సభ్యులు కేజీ ప్రభాకర్‌రావు, శివరాం ప్రసాద్, సోమనాథ మూర్తి, దుర్గాప్రసాద్, కళ్లే వేణుగోపాల్ శర్మ, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.





సూర్యనమస్కారాలు వేస్తున్న యోగా సభ్యులు, హరిహర క్షేత్రంలో ఆదిత్య హోమం నిర్వహిస్తున్న భక్తులు

అట్టహాసంగా ఎద్దుల బండలాగుడు పోటీలు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 16: మండలంలోని అనుగొండలో అవధూత రామిరెడ్డి వార్షిక తిరుణాలను పురస్కరించుకుని శుక్రవారం పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలను టీడీపీ యువనాయకుడు ఎల్ భరత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కర్నూలు మండలం పీ రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్లాగౌడ్ ఎద్దులు 3080 అడు గుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. మొదటి విజేతకు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు రూ.30 వేలు, రెండో స్థానంలో మల్యాలకు చెందిన షేక్ షైమున్నా ఎద్దులు 2804 అడుగులతో రూ.22వేలను పొందాయి.

ఐఐఐటీడీఎంను సందర్శించిన గుండు గౌతమ్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 16: జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీడీ ఎంను శుక్రవారం గూగుల్ ఇంజనీరింగ్ డైరెక్టర్ గుండు గౌతమ్ సందర్శించారు. గౌతమ్ గూగుల్‌లో 17 సంవత్సరాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీలో 12 సంవత్సరాలు పని చేశారు. హైదరాబాదు ఐఐఐటీలో విద్యనభ్యసించారు. క్యాంపస్ ఫ్యాకల్టీకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీపై రియ్యల్ టైమ్ అప్లికేషన్లపై ప్రసంగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 16: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన స్వాములు(45) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి శుక్రవారం తెలిపారు. మృతుడు నంద్యాల చెక్ పోస్టులో హమాలీగా పని చేసేవాడు. గురువారం రాత్రి నన్నూరు గ్రామంలో రోడ్డు దాటుతుండగా.. ఓర్వకల్లు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు స్వాములను ఢీకొంది. తీవ్రగాయాలైన స్వాములును స్థాని కులు గమనించి 108 అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కల్లూరు, ఫిబ్రవరి 16: జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ) జాతీయ సమితి నాయకులు జి.కొండప్ప, కే.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్బయ్య, గౌరవ సలహాదారు వైవీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎన్. రాజు, కే.శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. జర్నలిస్టులకు ఇచ్చే ఇళ్ళస్థలాల విషయంలో నిబంధనలు సడలించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు బీ.సుంకన్న, సి.అంజి, దస్తగిరి, మధుసూదన్‌గౌడ్, శివరాజ్‌కుమార్, అవినాష్, చిరంజీవి, మధు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు సి.మురళీమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సి.రాంగోపాల్, రామచంద్రమూర్తి, జిల్లా నాయకులు మహ్మద్‌హక్, మధుసూదన్ పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర అధ్యయనంతోనే భవిష్యత్తు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 16: భౌతిక శాస్త్ర అధ్యయనంతోనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని చైన్నైలోని రాజరామన్న అధునాతన సాంకేతిక కేంద్రం (ఆర్‌సీఏటీ) శాస్త్రవేత్త డాక్టర్ కమల్ అన్నారు. శుక్రవారం కేవీఆర్ డిగ్రీ మహిళా కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవ గాహన సదస్సు జరిగింది.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపా ల్ బీ.దేవికారాణి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎం.శారదా, అధ్యాపకులు మహబూబ్ బాషా, వాసవిదేవీ, ఎం.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అతిథిని శాలువతో సన్మానించారు.

ప్రజల కోసం పనిచేస్తా: టీజీ భరత్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 16: ప్రజల కోసం కష్టపడి పని చేస్తానని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని చాణిక్యపురి కాలనీలో భరోసా యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, తమ ప్రభుత్వం వస్తే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటుందన్నారు. కర్నూలుకు పరిశ్ర మలు తీసుకొచ్చి యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ క్రైపా పద్మలతారెడ్డి, బాబ్జీ, చంద్రమోహన్, వినోద్ చౌదరి, శేఖర్, విజయ్ కుమార్, జవహర్‌బాబు, ప్రమోద్, రామకృష్ణ, మల్లికార్జున గౌడ్, ఆనంద్, ఎద్దుపెంట అంజీ, నాగన్న, మనిగౌడ్, మద్దయ్య, అబ్రహం, అనిల్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 16: పాతబస్తీలోని 5వ వార్డులో రాంబొట్ల దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, రాజగోపురాన్ని శుక్రవారం నగర మేయర్ బీవై.రామయ్య, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంఏ.హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. ఈ స్టాం డింగ్ కమిటీ సభ్యుడు నగరూరు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు జీఏ లీవీ.సుజాత, అర్షియా పర్వీన్, జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మిళ్ళ వెంకట్రామిరెడ్డి ఆరాధన



పూజల్లో పాల్గొన్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

కోడుమూరు, ఫిబ్రవరి 16: స్థానిక తుమ్మిళ్ళ వెంకట్రామిరెడ్డి ఆలయంలో తాత 37వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. కేంద్ర మాజీమంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీటీలత, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధసూదన్‌రెడ్డి ఉన్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కోట్ల ప్రారంభించారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీశ్, క్రిష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, లింగన్న ఆలయంలో పూజలు చేశారు.

పరీక్షలపై అవగాహన

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 16: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పబ్లిక్ పరీక్షలలో విజయం సాధించడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు భయాన్ని వీడి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం వలన మంచి మార్కు లు సాధించవచ్చని అన్నారు. పరీక్షలలో పాటించాల్సిన మెలకువలపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, జబీన్ అక్తర్, సోమేష్, పార్థసారధి పటేల్, సుజాత, గిరిజారాణి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకులను గద్దె దింపుదాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



పత్తికొండలో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 16: వ్యవసాయ రంగాన్ని విస్మరించిన పాలకులను గద్దె దింపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం పత్తికొండలో వామపక్ష రైతులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ మాట్లాడారు. నరేంద్ర మోదీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పార్టీలకతీతంగా రైతులు పోరులో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్, ఏఐటీయూసీ నాయకులు క్రిష్టయ్య, రైతు సంఘం నాయకులు కారెన్న, ఉమామహేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరి, సురేంద్ర, గురుదాసు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయం ముందు ధర్నా, ర్యాలీ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్బంధించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రామాంజ నేయులు, రైతు సంఘం జిల్లా నాయకుడు పంపన్న గౌడు, సీపీఐ పట్టణ కార్య దర్శి రంగన్న, ఏఐటీయూసీ నాయకులు తిమ్మగురుడు, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు రాజు, ప్రసాద్ ఏఐకేఎస్ నాయకులు హను మంతు, అబ్దుల్లా, లక్ష్మీనరసయ్య, సీపీఐ నాయకులు కేసీ బజ్జార్, చినన్న, దాదావలి, బజారి, వీరేష్, ఇస్మాయిల్, యేసేపు, కేవీపీఎస్ నాయకులు ఆంథోని, రాజు, మాలమహానాడు నాయకులు నరసన్న, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు, గోవర్ధనమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 16: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో భారత గ్రామీణ బంద్ సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యన్న, ఐఎఫ్టీయూ నాయకులు బాల రాజు, పీడీఎస్‌యు జిల్లా నాయకులు నాగరాజులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, బాబు, పెద్దారెడ్డి, వెంకటేష్, నాగరాజు, మల్లేష్, బుడ్డన్న, దుర్గప్ప, రామకృష్ణ, రూబెన్‌లు పాల్గొన్నారు.

● గ్రామీణ బంద్‌లో భాగంగా శుక్రవారం ఏపీఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో కలుగొట్ల రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి యేసేపు, అనీఫ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకుంద, షాంసన్, భీమన్న, సుంకన్న, చిన్న ప్రసాద్, డేవిడ్ లు పాల్గొన్నారు.

రైతు, కార్మిక ద్రోహి నరేంద్ర మోదీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 16: పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మాధవస్వామి అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు నగేష్, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రాముడు, చిన్నయేసు, సత్యం, మహేష్, అయ్యస్వామి, ఏఐటీయూసీ నాయకులు హరి, నాగమద్దయ్య, మాధవకృష్ణ, గిరిబాబు, బాలరాజు పాల్గొన్నారు.

రైతులపై బుల్లెట్లు కురిపించడం దారుణం

కౌతాళం, ఫిబ్రవరి 17: ఢిల్లీలో ర్యాలీ చేస్తున్న రైతులపై బుల్లెట్లు కురిపించడం దారుణమని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు జగదీష్ అన్నారు. శుక్రవారం కౌతాళంలో గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని వివిధ రైతు సంఘాలతో కలిసి అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, వెంకటేష్, ఉలిగయ్య, రామలింగ, రైతు కూలీ సంఘం నాయకులు నాగేంద్ర, రమేష్, చంద్ర పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

దేవనకొండ, ఫిబ్రవరి 16 : రైతులకు మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం ఇచ్చి నల్ల చట్టాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటిశెట్టి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అన్నారు. శుక్రవారం దేవనకొండ బస్టాండ్ లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు అశోక్, సూరి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించండి

మంత్రాలయం, ఫిబ్రవరి 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు భాస్కర్ యాదవ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జయరాజు అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహం ముందు సీఐటీయూ, ఏఐటీయూసీ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ బంద్‌లో భాగంగా ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ భీమేశ్వరి, విశాలాక్షి, ప్రమీళ, కళ్యాణి, శ్వేత, సుజాత, పద్మ, జయానందకుమారి, సునీత, గాబ్రియేలు, ఏఐటీయూసీ నాయకులు రాముడు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

ఆలూరు, ఫిబ్రవరి 16: కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య అన్నారు. శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా ఆలూరు పట్టణంలోని బళ్లారి రోడ్డు నుంచి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకొని రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కే భూపేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీ రామాంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి హోతురప్ప పాల్గొన్నారు.



ఆలూరులో ర్యాలీ

● **కోసిగి, ఫిబ్రవరి 16:** సీపీఐ, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో గోపాల్, రాముడు, వీరేష్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగరత్న, భీమలింగమ్మ, ఆశా యూనియన్ నాయకురాలు వెంకటమ్మ, సుజాత, ఆటో యూనియన్ నాయకులు అమీర్, నరసింహులు పాల్గొన్నారు.

● **పెద్దకడబూరు, ఫిబ్రవరి 16:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను నిరసిసూ వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. ఆయా సంఘాల నాయకులు రోడ్లపైకి వచ్చి సమ్మె చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. బీజేపీ వ్యతిరేక విధానాల వల్ల రైతాంగంనాశనమైందని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, జిల్లా కర్యవర్గ సభ్యులు పరమేష్ ఆరోపించారు. కార్యక్రమంలో జాఫర్,పటేల్, కుమ్మరి, చంద్ర, వీరేష్, రైతు సంఘం నాయకులు హనుమంతు, ఈరన్న పాల్గొన్నారు.

ఆదోని రూరల్, ఫిబ్రవరి 16 : ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కమ్యూనిస్టు నాయకులు వెంకటేశులు, వెంకప్ప, లింగన్న, రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా, పెద్ద ఎత్తున కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజలు బంద్‌లో పాల్గొన్నారు. శిరుగుప్ప, కుప్పగల్, విరుపాపురం, సంతేకూడ్లూరు గ్రామ ప్రధాన రహదార్లలో పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు.



వెల్దుర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు

భ్రూణ హత్యలను నివారించాలి



భ్రూణ హత్యల నివారణపై మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ఆదోని, ఫిబ్రవరి 16: భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో భ్రూణ హత్యలు నివారించడం, పీసీ పీఎన్‌డీటీ చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, గైనకాలజిస్ట్ డాక్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింగ నిర్ధారణ చేస్తే రూ.50 వేల జరిమానాతోపాటు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. సమావేశంలో డీఎస్పీ శివనారాయణ స్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సత్యవతి, డా. మాధవీలత, మెడికల్ సూపరింటెండెంట్ ప్రమీల, డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

తాత్కాలికమైన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వసతులు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదోని ఎన్నికల అధికారి సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వాహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన తాత్కాలికమైన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ హసీనా సుల్తానా, మండల సర్వేయర్ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించాం

పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించామని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం సబ్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణ స్వామి, తహసీల్దార్, ఏఈఆర్‌వో హసీనా సుల్తానా, డీటీ రజనీకాంత్ రెడ్డి, ఎలక్షన్ సీనియర్ సహాయకులు ఖాసీం పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు

ఆదోని, ఫిబ్రవరి 16: ఆదోని మండలం సంతేకూడ్లూరు గ్రామంలో శుక్రవారం సామూహిక వివాహాలు వైభంగా జరిగాయి. శుక్రవారం రథసప్తమి సందర్భంగా 21 జంటలు ఒక్కటయ్యాయి. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ముందుగా రథసప్తమి పూజలు, స్వామి అమ్మవార్ల కల్యాణం అయ్యాక 21 జంటలకు ఒకే ముహూర్తంలో పెళ్లిలు జరిపించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు హాజరై నూతన జంటలను ఆశీర్వదించారు. ముందుగా చెన్నకేశవస్వామి, లక్ష్మీదేవి కల్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. వేడుకలకు వచ్చిన వారందరికీ ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు గోవిందప్ప ఉదయం నుంచి అవసరమైన సామాగ్రిని ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై సమావేశం

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 16: నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి సౌకర్యాలపై రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషారెడ్డి, గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్యలు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల సెక్టోరియల్ సిబ్బంది, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నందవరం, గోనెగండ్ల తహసీల్దార్లు ఓబులేసు, పార్వతి పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 16: రబీలో పంటలను సాగు చేసుకున్న రైతులు ఈ నెల 22 లోపు తమ సమీప రైతుభరోసా కేంద్రాలలో ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. శుక్రవారం మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలోని ఆర్‌బీకేలను తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు.

ఉద్యమం అంటే ఉలుకెందుకు?



దేవనకొండలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 16: సీపీఎస్ రద్దుపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీరచంద్ర యాదవ్ అన్నారు. శుక్రవారం చలో విజయవాడకు వెళ్లొద్దంటూ పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఐదేళ్లవుతున్నా హామీని అమలు చేయకుండా జీపీఎస్‌ను తీసుకొచ్చారన్నారు. నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో పని చేస్తున్న ఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌కు పోలీసులు వియవాడకు వెళ్లొద్దని ముందస్తు నోటీసులు అందజేశారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 16: ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 12వ పీఆర్‌సీ 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని పీఆర్‌సీ డీఏ బకాయిలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరె కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుడికల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసప్ప, ఉపాధ్యాయులు నాగరాజు, విజయ్‌కుమార్, అన్నపూర్ణ, నాగవేణి, సరిత, సులోచన, మన్సూర్‌బాషా, మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.

● పట్టణంలోని మాచాని సోమప్ప జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీజేఏసీ పిలుపు మేరకు ఉపాధ్యాయినులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పీఆర్‌సీ, మధ్యంతర భృతి ప్రకటించాలని, డీఏ బకాయిలు చెల్లించి, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు.

ఉద్యోగుల హామీలను నేరవేర్చాలి

దేవనకొండ, ఫిబ్రవరి 16: పీఆర్సీ, డీఏ అరియర్స్, జీపీఎఫ్, సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ బిల్లులు వంటి ఉద్యోగులకు ఇవాల్సిన హామీలను నెరవేర్చాలని జేఏసీ చైర్మన్ సాయిబాబా అన్నారు. మూడో రోజు స్థానిక పీహెచ్‌సీలో జేఏసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రంగస్వామి, సుంకన్న, భాస్కరరావు, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని మంజూరు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 16: ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కార్మికులకు మధ్యంతర భృతిని ఇవ్వాలని ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ నాయకులు ముస్తాక్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ డిపో ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎండీ షరీఫ్, బందెనవాజ్, పెయింటర్ భాస్కర్, రఫిక్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పెద్దకడబూరు, ఫిబ్రవరి 16: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఎస్టీఈయూ, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్, ఏపీయూఎస్ ఉపాధ్యాయుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, శంకరప్ప, నబీసాహెబ్, ఉసేని ఈరన్న, కిరణ్, గుంటెప్ప, దామోదర్, రాజేంద్ర, దొరబాబు, విజయకుమార్, మాలతి, సునీత, నాగజ్యోతి, మనోహర్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం రావాలి

తుగ్గలి, ఫిబ్రవరి 16: యువతలో రాజకీయ చైతన్యం రావాలని బీసీవై తాలుకా ఇన్‌చార్జి మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండ ల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత చదువుకున్న అనంతరం ఉద్యోగాల వైపు కాకుండా రాజకీయం వైపు ఆసక్తి చూపాలని కోరారు. అప్పుడే రాజకీయ ప్రక్షాళన జరుగుతుందని, రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని అన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, రాజు, చాంద్‌బాషా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

చిప్పగిరి, ఫిబ్రవరి 16: మండలంలోని ఏరూరు గ్రామంలో రూ.లక్ష విలువ చేసే గడ్డి వాములు దగ్ధమయ్యాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ నరసింహులుకు చెం దిన రెండు గడ్డివాములకు శుక్రవారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఎంపీ టికెట్ ఇవ్వాలి

తుగ్గలి, ఫిబ్రవరి 16: కర్నూలు ఎంపీ టికె ట్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రా ముడుకు ఇవ్వాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి కోరారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలి సి కర్నూలు ఎంపీ టికెట్ బత్తినకు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కురువ కులస్థుడైన బత్తినకు ఎంపి టికెట్ ఇస్తే.. ప్రతి ఒక్క బీసీ టీడీపీకి ఓటు వేసి ఎమ్మెల్యేతో పాటు ఎంపీని కూడా ప్రత్యేక మెజారిటీతో గెలిపిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫక్కీరప్ప, అక్బర్ బాషా ఉన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ఆదోని, ఫిబ్రవరి 16: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీటీసీ ఎల్లమ్మ, కో-ఆప్షన్ సభ్యులు బాషా, మొలగవల్లి సర్పంచ్ మోహన్ రాజ్ కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో నరేంద్రను ఘనంగా సన్మా నించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 16: ఎమ్మిగ నూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్కిల్‌లో జాతీయ రహదారిపై బొలేరో వాహనం ఢీకొని కుమ్మరి విజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన కుమ్మరి విజయ్ బైక్‌పై పట్టణానికి వస్తున్నాడు. మార్కెట్ సర్కిల్‌లో పట్టణంలో నుంచి మంత్రాలయం వైపు వెళ్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కుమ్మరి విజయ్‌కి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4 వేలు వసూలు చేశారు

మద్దికెర, జనవరి 16: మండలంలోని పెరవలి గ్రామంలో అధికార పార్టీ నాయకులు పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.4వేలు వసూలు చేశారని బాధితులు నాగరాజు, శంకరయ్యతో పాటు రాజశేఖర్, రాజు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పక్కా గృహాలకు బిల్లులు మంజూరు చేయిస్తామంటే అధికార పార్టీకి చెందిన చోటా నాయకులకు డబ్బులు ఇచ్చామని, ఇంత వరకు అతీగతి లేదని, డబ్బులు అడిగితే అధికారులకు ఇచ్చామని చెబుతున్నారని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఫిబ్రవరి 16: కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఇంద్రేష్ శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు.

ఆలూరు టికెట్ కోట్ల సుజాతమ్మకు ఇవ్వాలి

ఆలూరు, ఫిబ్రవరి 16: ఆలూరు టీడీపీ టికెట్ కోట్ల సుజాతమ్మకు ఇవ్వాలని ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్ యాదవ్, బోయ వాల్మీకి సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నరసప్ప అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మకు అవకాశం కల్పిస్తే వైసీపీ అభ్యర్థిను ధీటుగా ఎదుర్కొని విజయం సాధిస్తుందన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ జయంతి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 16: శ్రీకృష్ణదేవరాయ జయంతి వేడుకలను శుక్రవారం ఆదోని బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి, ఆ సంఘం నాయకులు పూలమా వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి చందం మల్లికార్జున నాయకులు భీమలింగప్ప, రంగన్న, బండి శ్రీనివాసులు, కమతం శ్రీనివాసులు, గోపాలకృష్ణ, నాగేంద్రయ్య పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుని కల్యాణం

మద్దికెర, జనవరి 16: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం మూలవిరాట్ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథసప్తమి సందర్భంగా భూదేవి శ్రీదేవి సతీసమేత రంగనాథస్వాములకు ఆలయ పురోహితులు కల్యాణోత్సవాన్ని జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో పెట్టి సూర్యప్రభ వాహనంలో మాడవీధుల్లో పల్లకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు తదితరులు ఉన్నారు.

అవకతవకలు జరిగితే బీఎల్వోలదే బాధ్యత

మంత్రాలయం, ఫిబ్రవరి 16: ఎన్నికల్లో అవకతవకలు జరిగితే బీఎల్వోలదే బాధ్యత అని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌పై ఓటు ఎవరికి వేస్తున్నామన్నది ఓటరు చూసుకునే విధంగా బీఎల్వోలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎల్వోలు ఆనంద్, ఆదామ్, భీమన్నగౌడు, భీముడు, నతానియేలు, సునీత, ప్రభాకర్, సాయినవ్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మిమ్మల్నే నమ్ముకున్నా : ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర, జనవరి 16: ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయంటే.. అది వలంటీర్ల వల్లే సాధ్యమైందని ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ కమ్యూనిటీ హాలులో వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని, అందుకు ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించాలని వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనితా యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

తుగ్గలి, ఫిబ్రవరి 16: బీటీ రోడ్డు నిర్మాణానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భూమి పూజ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని మారెళ్ల నుంచి బోయబొంతిరాళ్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు బొందిమడుగుల, మారెల్ల గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీమఠం గోశాలకు పశుగ్రాసం విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమఠం గోశాలకు కర్ణాటకకు చెందిన భక్తులు 36 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని విరాళంగా అందజేశారు. శుక్రవారం కర్ణాటక నుంచి దాదాపు 30 ట్రాక్టర్లు గ్రాసాన్ని తీసుకువచ్చి మధ్వమార్గ్ కారిడార్‌లో ఉంచారు. గ్రాసాన్ని తెచ్చిన రైతులను మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభినందించి శేషవస్త్రం, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.